ప్రజాశక్తి
బుధవారం 4 సెప్టెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



చిన్నారులకు పాల డబ్బాల వితరణ

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుం పంచాయతీ గొందిగుడ గ్రామానికి చెందిన వంతాల సొంయిత ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చి అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరిక మేరకు యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు చెందిన ప్రతినిధులు, నీలి జోస్ఫిన్‌తో కలిసి మంగళవారం అరుకులో బాధిత కుటుంబానికి పాల డబ్బాలను వితరణ చేశారు. బాధిత కుటుంబానికి ప్రతినెలా పాల డబ్బాలను పంపిణీ చేస్తామని భరోసానిచ్చారు. బాధిత కుటుంబీకుల పట్ల ట్రస్ట్ బోర్డ్యానికి సురేంద్రతో పాటు గిరిజన సంఘం నేతలు, కవల కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు రాంచందర్ పాల్గొన్నారు.


పాల డబ్బాలను అందజేస్తున్న సురేంద్ర

ఒప్పంద జిఓలను అమలు చేయాలి

పిహెచ్‌సిల వద్ద ఆశాలు, సిహెచ్‌డబ్ల్యుల నిరసన


మినుములూరు పిహెచ్‌సి వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి-పాడేరు: వేతన పెంపుపై ఫిబ్రవరి 9న జరిగిన చర్చల్లో ఒప్పందాల జిఒలను సర్క్యులర్ వెంటనే, విడుదల చేయాలని ఆశ వర్కర్లు మినుములూరు పిహెచ్‌సి వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందరరావు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తించాలని, ఆశ వర్కర్లపై రాజకీయ, అధికార వేధింపులు ఆపాలని కోరారు. పాడేరు ఏజెన్సీ 11 మండలాల ఆశ వర్కర్ల సమస్యలపై జిల్లాలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కరించాలన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసమ్మ, ఇతర మండలాల నాయకులు పార్వతమ్మ, మోదకొండమ్మ, కొండమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో వినతిపత్రం ఇస్తున్న ఆశాల యూనియన్‌నేత వాణిశ్రీ, తదితరులు

అరకులోయ రూరల్: ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని, సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మార్చు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అరకులోయ మండలం మాడగడ పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆశా కార్యకర్తల దీక్షల సమయంలో కుదిరిన ఒప్పందాల జిఒలను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని భారంతో ఇబ్బంది పడుతున్న ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కారం చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు పని చేయడం లేదు అని చెప్పారు. రిఫరల్ కేసులకు టిఎ, డిఎ చెల్లించాలని కోరారు. యూనియన్ నాయకులు రాధిక, నాగలక్ష్మి, జన్ని కాసులమ్మ, వసంత పాల్గొన్నారు.


చింతపల్లి: ఎన్నికలకు ముందు 66రోజులు సమ్మె చేపట్టిన ఆశావర్కర్లతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు జారీ చేసిన జిఒలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆశ వర్కర్ల యూనియన్, సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తాజంగి, లంబసింగి పిహెచ్‌సిల వద్ద నిరసన చేపట్టారు. ఆశాల యూనియన్ నేతలు వకోటి లక్ష్మి, భానుమతి, చెల్లయమ్మ, బాలమ్మలతో కలిసి ఆయా పిహెచ్‌సిల వైద్యాధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు దేశగిరి సుభద్ర, హైమావతి, బీసాయి ఈశ్వరమ్మ, సింహాచలం పాల్గొన్నారు.

మారేడుమిల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్లకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా డే సందర్భంగా మారేడుమిల్లి పిహెచ్‌సి వద్ద మంగళవారం ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు మట్ట వాణిశ్రీ మాట్లాడుతూ పిహెచ్‌సిల్లో ఆశవర్కర్లపై అధికారులు తీవ్రమైన వేధింపులు చేస్తున్నారని, పని ఒత్తిడి బాగా పెంచారని, వారిపై రాజకీయ నాయకుల ఒత్తిడి కూడా రోజు రోజుకు పెరిగిపోతుందని, వీటిని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

మోతుగూడెం: చింతూరు మండలం, తులసిపాకలో ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్ అదనపు పనులు, ఆన్‌లైన్ సెల్ ఫోన్లతో మెజారిటీ ఆశ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక గంట పర్మిషన్ కావాలన్నా, ఒక రోజు సెలవు కావాలన్నా అధికారుల దయ దాక్షిణ్యాలు మీద ఆధారపడాల్సి వస్తుందని వాపోయారు.


అరకులోయలో వినతిపత్రం ఇస్తున్న ఉమామహేశ్వరరావు, ఆశాలు

సీలేరు : ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.విష్ణుకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని స్థానిక వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లికి మంగళవారం వినతి పత్రం అందజేశారు.ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు అల్లూరి జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పెదవలస పిహెచ్‌సి వైద్య అధికారికి మంగళవారం అందజేశారు. ఆశ వర్కర్లు సాలీచాలని జీతాలతో వారి కుటుంబ పోషణ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెదవలస పిహెచ్సి ఆశా వర్కర్లు యూనియన్ అధ్యక్షురాలు సాగని కృష్ణకుమారి, కార్యదర్శి రమాదేవి, అరుణ, జ్యోతి, ప్రభ, గంగాభవాని, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.


సీలేరులో డాక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

భోజన మెనూ కచ్చితంగా అమలు చేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్/ డుంబ్రిగుడ: గిరి విద్యార్థుల పొట్ట కొట్టకుండా మెనూ సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం, జడ్పీ చైర్మన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు మండలంలోని జాంగూడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సందర్శించారు. అస్వస్థతతో కోలుకున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు వండి పెట్టిన భోజన మెనూను పరిశీలించి రుచి చూశారు నిత్యావసర సరకులు, కూరగాయల గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు రోజు వారి మెనూను పరిశీలించే బాధ్యత విద్యార్థి లీడర్లు చూసుకోవాలన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన మెనూనుతోపాటు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. తప్పు చేసిన యాజమాన్యానికి వత్తాసు పలకకుండా, క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. జడ్పీ నిధులతో భోజనశాల ఏర్పాటు అయ్యేలా చూస్తామని జడ్పీ చైర్పర్సన్ సుభద్ర అన్నారు. విద్యార్థులకు పెట్టే పోషకాహార విషయంలో పొట్టకొట్టకుండా. చూడాలన్నారు. నాణ్యమై ఆహారంతోనే శారీక ఎదుగుదల, ఆరోగ్యవంతులుగా ఉండడానికి దోహదపడుతుందని చెప్పారు. ఘటనకు కారుకులైన చర్యలు తీసుకుని ఇలాంటి దురదష్టకర సంఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మరోమారు పాఠశాలలో వస్తామని తీరు మార్చు కోకపోతే చర్యలు తీసు కోవావాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు.

అంతకుముందు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థినులను పరామర్శించారు. విద్యార్థులు ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. డుంబ్రిగుడ ఎంపిపి బాక ఈశ్వరి, జెడ్‌పటిసి చట్టారి జానకమ్మ, వైస్ ఎంపిపి లలిత, అరకులోయ ఎంపిటిసి దురియ ఆనంద్, వైసిపి నేతలు కమ్మిడి అశోక్, బాక సింహాచలం పాల్గొన్నారు..


అరకు ఆసుపత్రిలో బాధిత విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, జెడ్‌పి చైర్‌పర్సన్


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

మారుమూల గ్రామాలకు రహదారుల ఏర్పాటు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో వివిధ ఇంజనీర్ విభాగాల ఇంజనీర్లతో ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో మారుమూల గ్రామాలకు లింక్ రోడ్లు ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. ప్రతిపాదనలు చేసే రోడ్లకు ఎన్ని కిలోమీటర్లు రోడ్డు ఏర్పాటు చేయవలసి ఉన్నది, ఎన్ని వంతెనలు, ఎన్ని కల్వర్టులు కట్టవలసి ఉన్నది తదితర విషయాలు నివేదికలో పొందిపర్చాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, గౌతమి, శ్రీనివాసరావు, రాజేంద్ర బాబు, నాగరాజు, ఏఈలు సత్యనారాయణ, పి వెంకటరమణ, వంశీ, ఉమామహేశ్వరరావు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.


నూతన సబ్ కలెక్టర్ కల్పశ్రీను కలిసిన కార్యాలయ అధికారులు, సిబ్బంది

సబ్ కలెక్టర్ కల్పశ్రీకి అభినందనలు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. నూతన సబ్ కలెక్టర్‌కు కార్యాలయ పరిపాలన అధికారి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులకు రెవెన్యూ పరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి యం.సావిత్రి, తహశీల్దార్లు సిహెచ్.శ్రీనివాసరావు, సత్యనారాయణ, కె.సుబ్బారావు, బి.రాజు, రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్లు బాలాజీ, శ్రీధర్, శివ, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ బాబురావు, కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జ్వర బాధితుడు మృతిపై ఐటిడిఎ పిఒ విచారణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

డెంగ్యూ లక్షణాలతో సోమవారం వ్యవసాయ కూలి పి.రమణ మృతి చెందడంపై రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం మంగళవారం విచారణ చేపట్టారు. మండలంలోని లగరాయి పిహెచ్సిని మంగళవారం ఆకస్మిక సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. వ్యవసాయ కూలి రమణ ఏవిధంగా మృతి చెందినది, అతనికి అందిన వైద్య సేవలు గురించి, సిబ్బంది పనితీరు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుడు రమణ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రమణకి ఎప్పుడు జ్వరం వచ్చినది, వైద్య సేవలు ఏ విధంగా పొందినది, వైద్య సిబ్బంది తమ పట్ల ఏ విధంగా వ్యవహరించారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. రమణ మృతిపై విచారణ అధికారిగా రంపచోడవరం అడిషనల్ డిఎం అండ్ హెచ్‌ఒ శిరీషను నియమించారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, లబ్బర్తి, లాగరాయి సర్పంచ్‌లు మిరియాల ఘనలక్ష్మి, ఎం సత్యవతి, పిహెచ్సి వైద్యాధికారి ఉషశ్రీ, పిహెచ్సి వైద్య సిబ్బంది. గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-చింతూరు

మంచి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి దేవరకొండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కుమ్మూరు గ్రామంలో వరి పొలాలను మంగలవారం ఆయన పరిశీలించారు. అనంతరం కుమ్మురు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు సమగ్ర పోషక యాజమాన్యంపై పొలంబడి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరు 20 నుంచి 25 రోజుల దశల్లో ఉన్నందని, ఈ సమయంలో రైతులు కలుపు మందులు చల్లకుండా, ఎరువు వేసి మనుషులతో కలుపు తీయించుకోవాలని సూచించారు. ఎకరానికి 100 కేజీల నాణ్యం గల వేప పిండిని వరి పొలంలో వేసుకున్నట్లయితే నత్రజని భాస్వరం పొటాష్ పోషకాలతో పాటుగా సూక్ష్మ పోషకాలు అందుతాయని చెప్పారు. పైరుపై సూక్ష్మధాతు లోపాలు కనిపిస్తే ఐదు నుంచి వారం రోజుల వ్యవధిలో ఫార్ములా ఫోర్ అనే సూక్ష్మ పోషకాల మందుని పైరు తడిచే విధంగా పిచికారీ చేయాలి, పొలం వద్దే జీవామృతం తయారు చేసుకొని వారం రోజులకు ఒకసారి వరి పైరుకి వర్షం పడిన సమయంలో పొలంలో వదలాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గణేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ సురేష్, వీరబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు ముఖేష్, రవితేజ, ప్రకృతి వ్యవసాయం నుంచి దుమ్మిరి వెంకటేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి దేవరకొండ శ్రీనివాస్

డెంగీ మరణాలపై కలెక్టర్ సీరియస్

- సమగ్ర నివేదిక ఇవ్వాలని పిఒలకు ఆదేశం
- ఏడుగురు సిడిపిఒలకు షోకాజ్ నోటీసులు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు : జిల్లాలో డెంగీతో ఇటీవల ఇద్దరు మృతి చెందడంపై జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సీరియస్ అయ్యారు. మంగళవారం కలెక్టరేట్ నుండి ఐటిడిఎ పిఒలు, జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, తహసిల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డెంగీ మలేరియా వ్యాధుల నివారణకు సమీక్షలో రాజవొమ్మంగి సిహెచ్‌సి, పాడేరు జిజీహెచ్ ఫరిధిలో డెంగీతో ఇద్దరు మరణించడంపై తీవ్రంగా స్పందించి, దీనిపై పాడేరులో మృతుల ఇంటికి వెళ్లి, అలాగే ఆసుపత్రిలో విచారణ జరిపి సమగ్ర నివేదిక అందజేయాలని సంయుక్త కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌ను ఆదేశించారు. దానికి అనుగుణంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే రాజవొమ్మంగిలోడెంగీ మరణంపై ను విచారణ జరిపి నివేదిక అందజేయాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు.

ఐసిడిఎస్ సమీక్షలో పిల్లల వయసు, బరువు, ఎత్తులకు సంబంధించి అందించిన డాటాలో తప్పులు ఉండటంపై హుకుంపేట సిడిపిఒ సమాధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన అనంతగిరి, అరకు, దుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, జికె.వీధి, జి. మాడుగుల సిడిపిఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పిడి సూర్యలక్ష్మిని ఆదేశించారు. పౌష్టికాహార పునరావాస కేంద్రాలలో అత్యధిక మొత్తాలకు బిల్లులు పెడుతున్న నేపథ్యంలో ఇక నుండి బిల్లులపై ఐసిడిఎస్ పిడి కౌంటర్ సంతకం ఉండాల్సిందేనని స్పష్టం చేసారు. అంగన్వాడీలు రెండు రోజులకొక సారి తప్పనిసరిగా గృహ సందర్శన చేయాలని, గర్భిణులు, బాలింతల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత సూపర్వైజర్, డాక్టర్, ఎఎన్ఎం తదితరులకు సమాచారం వెంటనే అందించాలని ఆదేశించారు. ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద చేపట్టిన ప్లాంటేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని, వంద రోజుల పని దినాలు కల్పించాలని ఆదేశించారు. బ్యాంకు లింకేజీలు, రుణ రికవరీపై సూచనలు చేశారు. గ్రామాల్లో చెత్త చెదారాలు తొలగించి, నెలాఖరుకు చాలని, డంప్ ఫ్రీ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చాలా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన శ్రెడ్డింగ్ మెషీన్లు ఆచూకీ లేదని, వీటిపై విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని ఎంపిడిఒలను ఆదేశించారు.బాధ్యుల నుంచి రికవరీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జేసి డాక్టర్ ఎం జె అభిషేక్, రంపచోడవరం పిఒ కట్టా సింహాచలం, డ్వామా, డిఆర్‌డిఎ ఐసిడిఎస్ పిడిలు ఎం. శివయ్య, వి. మురళి, ఎన్ సూర్యలక్ష్మి, డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాషా, డిపిఒ టి. కొండలరావు, డివిజినల్ పిఒ విఎస్ కుమార్, హౌసింగ్ ఇఇ బాబు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా రహదారులు


- చెప్పకుందామంటే ఆర్ అండ్ బి అధికారులెక్కడ?
- మండల పరిషత్తు సమావేశాలకు హాజరు కాకపోవడంపై సభ్యుల మండిపాటు
- నిలదీసిన సిపిఎం ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పలు ఆర్ అండ్ బి రహదారులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయని, వాటి గురించి తెలియజేద్దామంటే మండల పరిషత్తు సమావేశాలకు ఆర్ అండ్ బి శాఖ అధికారులు హాజరు కావడం లేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని రేఖపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎంకు శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, చిన్నమట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్దమటపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య మాట్లాడుతూ ఆర్ అండ్ బి రహదారుల సమస్యలను చెప్పుకుందామంటే ఏ ఒక్క అధికారి రాలేదని, ఎన్నిసార్లు సమావేశాలు జరిగిన ఒక్క సమావేశానికి ఆర్ అండ్ బి అధికారులు హాజరు కావడం లేదని పేర్కొన్నారు. రహదారులన్నీ గుంతలు గుంతలుగా ఉన్నాయని, మరోవైపు రోడ్డుకి ఇరువైపులా చెట్లు అడ్డుగా ఉండి ప్రయాణికులకు తగులు తున్నాయని, వీటి వల్ల అనేకసార్లు ప్రమాదాలు జరిగాయని తెలిపారు. అయినా ఏ ఒక్క అధికారి రహదారుల గురించి పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా రహదారులకు మరమ్మతులు చేయాలని, సమావేశానికి హాజరు కాని ఆర్ అండ్ బి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, తహశీల్దారు సుబ్బారావు, ఎంపీడీవో ఫణిందర్ రెడ్డి, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రశ్నిస్తున్న సిపిఎం ఎంపిటిసి సభ్యులు పూనెం ప్రదీప్‌కుమార్

వరద శానిటేషన్ నిధులు ఏం చేశారు?

- ఎంపిడిఒకు, సర్పంచ్‌లకు కూడా తెలియజేయకపోవడం విడ్డూరం
- పంచాయతీ కార్యదర్శుల తీరుపై ఎంపిపి కారం లక్ష్మి మండిపాటు

ప్రజాశక్తి-విఆర్.పురం

వరదలు అనంతరం శానిటేషన్ పనుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఏం చేశారని ఎంపిపి కారం లక్ష్మి ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి వరదల్లో ముంపునకు గురైన విలీన మండలాల్లోని శానిటేషన్ పనుల నిమితం ప్రభుత్వం కొంత నిధులు మంజూరు చేసిందని, ఈ నిధులను నాటి పరిస్థితులను బట్టి నేరుగా పంచాయతీ కార్యదర్శులకు నగదు రూపంలో అందజేసిందని చెప్పారు. ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో తెలియడం లేదన్నారు. వరదలకు శానిటేషన్ కోసం నిధులు వచ్చాయన్న విషయాన్ని ఇప్పుడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నిధులు వచ్చిన విషయం ఎంపిడిఒకు, సర్పంచులకు కూడా తెలియకుండా కార్యదర్శులందరూ ఏకమయ్యారని, ఇంత గోప్యంగా ఉంచడంలోనూ, ఈ నిధులకు లెక్కలు చెప్పకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అసలు పంచాయతీలో నిధులు ఖర్చు చేసే విషయం స్థానిక సర్పంచ్‌లకు చెప్పరా? అని మండిపడ్డారు. కార్యదర్శులు ఇష్టానుసారంగా వ్యవహరించి నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, చిన్నమటపల్లి ఎంపీటీసీ పూనం ప్రదీప్ కుమార్, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని తదితరులు పాల్గొన్నారు.

శ్రీవల్లికి అభినందనలు


బోయిన శ్రీవల్లి

ప్రజాశక్తి - అనంతగిరి : సామాన్య గిరిజన కుటుంబానికి చెందిన బోయిన శ్రీవల్లి నీట్‌లో సత్తా చాటి ఎంబిబిఎస్‌లో ప్రవేశార్హత సాధించడంపై హర్షం వ్యక్తమౌతోంది. ఈ మేరకు శ్రీవల్లిని పలువురు అభినందించారు. అనంతగిరి మండల కేంద్రంలోనిబొడ్డపుట్టు కాలనీకి చెందిన బోయిన శ్రీవల్లి, తండ్రి భీమన్న ఎంపిడిఒ కార్యాలయంలో పనిచేస్తున్నారు. తమ బిడ్డను బాగా చదివించి ఉన్నతస్థాయిలో చూడాలని ఆకాంక్షతో శ్రీవల్లిని మొదటి నుంచి మంచి విద్యాసంస్థల్లో చేర్పించి చదివిస్తున్నారు. రెండవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు భీమిలి ఎపిజె పాఠశాలలోనూ, అనంతరం 8వ తరగతి నుండి 10వ, తరగతి పశ్చిమగోదావరి జిల్లా ద్వారక తిరుమల తాడిపర్రు ఆశ్రమంలో చదివి 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించింది, ఇంటర్‌ను తగరపువలస శ్రీ పాఠశాలలో చదివి 986 మార్కులు సాధించింది, హైదరాబాద్ బీబీ నగర్‌లో శిక్షణపొంది, నీట్ పరీక్షలో 720 మార్కులకు గాను 638 మార్కులు సాధించి ఎంబిబిఎస్‌లో ప్రవేశార్హత సాధించింది. శ్రీవల్లిని, ఆమెను బాగా చదివిస్తున్న తల్లిదండ్రులను పలువురు అభినందించారు.


పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పింఛన్ల పంపిణీలో అల్లూరి టాప్

డిఆర్‌డిఎ పీడీ, ఎంపిడిఒలు, సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి -పాడేరు : ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అల్లూరి జిల్లా ప్రథమ స్థానం సాధించడంపై జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను అభినందించారు. జిల్లాలో 1,25,262 మంది పింఛను లబ్ధిదారులుండగా, 1,24,681 మందికి పంపిణీ చేసి 99.54 శాతంతో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి రోజైన ఆగస్టు 31న రాత్రి 11గంటల సమయానికి జిల్లా వ్యాప్తంగా 93 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది ప్రజల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీని నిరంతరం పర్యవేక్షించిన డిఆర్‌డిఎ పిడి వి.మురళిని కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా వర్షం పడుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన ఎంపిడిఒలను, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు పడుతూ, సకాలంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేసిన సచివాలయ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తిని ప్రతి నెలా కొనసాగించి జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలని సంబంధిత సిబ్బందిని, అధికారులను కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. కాగా జిల్లాలో మారేడుమిల్లి మండలం 99.75 శాతం పంపిణీ చేసి మొదటి స్థానం సాధించగా, అరకు వేలీ మండలం 99.71 శాతం పంపిణీతో రెండవ స్థానం, డుంబ్రిగుడ మండలం 99.66 శాతంతో మూడవ స్థానంలో నిలిచాయి. జి.మాడుగుల మండలంలో 99.25 శాతం పింఛన్ల పంపిణీ చేసి ఆఖరి 22వ స్థానంలో నిలిచింది. మారేడుమిల్లి మండలంలో 1992 మంది లబ్ధిదారులకు పింఛన్లు విడుదల కాగా 1987 మంది లబ్ధిదారులకు పంపిణీ జరిగింది. అదేవిధంగా అరకు వేలీ మండలంలో 6537 మంది లబ్ధిదారులకు పింఛన్ విడుదల కాగా 6518 మందికి పంపిణీ జరిగింది. డుంబ్రిగుడ మండలంలో 6449 మంది లబ్ధిదారులకు పింఛన్ విడుదల కాగా 6427 మందికి పంపిణీ జరిగింది. జిల్లా వ్యాప్తంగా 1,25,262 మంది లబ్ధిదారులకు పింఛన్లు విడుదల కాగా 1,24,681 మందికి పంపిణీ చేయడం జరిగింది. ఇందులో కేవలం 577 మందికి మాత్రమే వివిధ కారణాల వల్ల పంపిణీ జరగలేదు. ప్రస్తుతం మరొక్కసారి గ్రామ స్థాయిలో పంపిణీకి సచివాలయ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. తదుపరి ఆయా కారణాలను విశ్లేషించి నివేదికలు సమర్పిస్తే తదుపరి నెలలో వాటిపై తగు చర్యలు తీసుకుంటారు.

తుంబవలసలో తిష్టవేసిన జ్వరాలు

-దగ్గు, చలి, విరేచనాలతో జనం విలవిల

-వైద్యం అందక మంచాల్లోనే మగ్గిపోతున్న బాధితులు


జ్వరంతో బాధపడుతున్న గిరిజన యువకుడు

ప్రజాశక్తి -హుకుంపేట : అనంతగిరి మండల సరిహద్దుల్లో హుకుంపేట మండలానికి చెంది, శివారున ఉన్న బూర్జ పంచాయతీ తుంబవలస గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. చలి జ్వరాలు, విరోచనాలతో వారం రోజులుగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైద్యసేవలకు ఆసుపత్రులకు వెళ్లే వీలులేని పరిస్థితుల్లో అస్వస్థతతో మంచాలపైనే మగ్గిపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. తమ గ్రామానికి వర్షానికి వాహనాలు వచ్చే అకాశమే లేదని అంటున్నారు. గ్రామంలో కోర్రా రత్నమ్మ , కొర్ర సురేష్, కొర్ర రామన్న, దొర సందు, కోర్ర అప్పారావు తదితరులు చలి జ్వరం, జలుబు దగ్గుతో ఇబ్బందులు పడుతుండగా, దొర వెన్నెల విరోచనాలు, జ్వరంతో బాధపడుతోంది.

సీజనల్‌గా ప్రబలే జ్వరాలు, వ్యాధులు పట్ల వైద్యసిబ్బంది అప్రమత్తతతో ఎప్పటికప్పుడు వైద్యసేవలు అందించాల్సి ఉన్నప్పటికీ, తమ గ్రామంవైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా వైద్యఆరోగ్యశాఖ అధికారులు స్పందించాలని, జ్వరాలు ప్రబలిన గ్రామంలో తక్షణమే వైద్యశిబిరాలను నిర్వహించాలని మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎస్ హైమావతి కోరారు. తుంబవలస గ్రామాన్ని వైద్యసిబ్బంది సందర్శించి, జ్వరాలు అదుపులోకి వచ్చేంతవరకు వైద్యసేవలు అందించాలని కోరుతున్నారు.

మధ్యాహ్నం బలవర్ధక ఆహారం అందించాలి

హెచ్‌ఎంలు, విద్యాకమిటీ సభ్యుల వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు : ప్రభుత్వ బడులలో మధ్యాహ్నం భోజన పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసి పాఠశాల విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ పరిధిలో ఎంఇఒలు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులతో భౌతికంగాను, చింతూరు, రంపచోడవరం డివిజన పరిధిలోని వారితో పర్చువల్‌గా మెనూ రూప కల్పన, మధ్యాహ్నం భోజన పథకం అమలుపై నిర్వహించిన ఒక రోజు వర్కషాపులో మాట్లాడారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖా మంత్రి మధ్యాహ్నం భోజన పథకం అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించారని అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులకు ఇష్టమైన మెనూను అందించాలన్నారు. ప్రాంతాల వారీగా ఉన్న ఆహారపు అలవాట్లు, బియ్యం, పప్పులు, ఆయిల్ ప్రభుత్వం నిర్దేశించిన విధంగాను, ఆయా ప్రాంతాలలో లభ్యమవుతున్న కూరగాయలు, ఆకుకూరలతో వంటలు తయారు చేయాలని సూచించారు.. పిల్లలకు ఇష్టపడే ఆహార పదార్థాలలో సూక్ష్మ పోషకాలు, ప్రోటీన్లు, క్యాలరీలు సక్రమంగా అందే విధంగా ఆహార పదార్ధాలు వండి వడ్డించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తొంబై తొమ్మిదిశాతం పేద విద్యార్థులు చదువుకుంటున్నారని, వారికి నాణ్యమైన పోషకాహారం ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అందించాలన్నారు. భోజనంలో 900 క్యాలరీలు, 23 గ్రాముల ప్రోటీన్లు ఉండే విధంగా ఆరు రోజులకు అవసరమైన మెనూ చార్టును సిద్ధం చేయాలని సూచించారు. అలాగే ారంలో మూడు రోజులు చిక్కీలు, మరో మూడు రోజులు రాగి జావ విద్యార్థులకు అందించాలన్నారు. వర్కుషాపులో రంపచోడవరం ఐటిడిఎ రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పిఒలు కట్టా సింహాచలం, అపూర్వ భరత్ పర్చువల్‌గా పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సమస్యలు పరిష్కరించకుంటే 7 నుంచి సమ్మె

జిజిహెచ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి పాడేరు : ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఈనెల 7 నుంచి పరిష్కరించుకుంటే సమ్మె తప్పదని సిఐటియు, ఎఐటియుసి నేతలు హెచ్చరించారు. ఈ మేరకు పాడేరు జిజిహెచ్‌లో వివిధ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని పదిరోజుల క్రితమే ఆసుపత్రి సూపరెంటిండెంట్‌కు సమ్మె నోటీసు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి నేతలు సుందరరావు, జల్లి రాజబాబు, అమర్ మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, దీనిపై అనేక మార్లుఉన్నత అధికారులకు తెలియజేసి, సమ్మె నోటీసు ఇచ్చిన స్పందన లేదన్నారు. గత నెల 24న అధికారులతో చర్చల్లో సెప్టెంబర్ మొదటి వారంలో సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని, అయినా చర్యల్లేవన్నారు.. వివిధ విభాగలలో ఖాళీగా ఉన్న సిబ్బందిని వెంటనే నియమించాలని కోరారు. కార్యక్రమములో యూనియన్ నాయకులు అనంత్, ఎలీషా, సరోజిని, అన్నపూర్ణ, స్వామి, రాంబాబు, భవాని, రాజు, చంటి, శ్రీను, రాజు, సూరిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆశ్రమ విద్యార్థినుల అదృశ్యం కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి పాడేరు: బంధ వీధి గిరిజన సంక్షేమబాలిక ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికల అదృశ్య ఘటనకు సంబంధించిన కేసులో ముగ్గురు వ్యక్తులను మంగళవారం పాడేరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు వారి తల్లిదండ్రులు ఐటిడిఎ పిఓ కు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగు చూసిన సంగతి విదితమే. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఘటనతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న నిందితులు డుంబ్రిగుడ మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ నిక్కుల శేషు, భారత్ గ్యాస్ ఏజెన్సీ లో పనిచేస్తున్న చినబాబు, గోపీచంద్‌లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పాడేరు సిఐ దేవరపల్లి నవీన్ కుమార్ వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి- పెదబయలు : సీజనల్‌గా ప్రబలే వైరల్ జ్వరాలతోపాటు డెంగీ, మలేరియా;టైఫాయిడ్‌ల పట్ల ఆశావర్కర్లు అప్రమత్తంగా ఉండాలని రూడకోట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సత్యారావు అన్నారు. మంగళవారం పిహెచ్‌సిలో ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లడుతూ, గ్రామాల్లో డయేరియా, విషజ్వరాలు ప్రబలితే వెంటనే సంబంధిత సమాచారం పిహెచ్‌సికి, వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. రవాణా, రహదారి సౌకర్యంలేని గ్రామాల్లో గర్భిణులను ప్రసవానికి రెండు వారాల ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని, ప్రతినెలా 9న గర్భిణులకు వైద్యపరీక్షలు చేయించాలన్నారు. ఈనెల 17న నులిపురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రూడకోట సర్పంచి కె సురేష్ కుమార్, బింగురాజు పాల్గొన్నారు


ఆశాలతో మాట్లాడుతున్న డాక్టర్ సత్యారావు

జాబ్‌మేళాలో 52మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- అరకులోయ/ అరకు రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంస్థ ఆధ్వర్యంలో అరకులోయ ఆర్‌ఐటిఐ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, ముతూట్ ఫైనాన్స్, మోడరన్ వీర్ సెక్యూరిటి సర్వీసెస్, మదర్ అండ్ ఫాదర్, అమెజాన్ కేఎల్ గ్రూప్, అమర్ రాజా బ్యాటరీస్ తదితర ఏడు ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. జాబ్‌మేళా వచ్చిన 142 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి, 52 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా అరకు సిఐ హిమగిరి మాట్లాడుతూ, వెతుకుతూ ఇంటికి వచ్చిన ఉద్యోగాన్ని కాలదన్నుకోకుండా, దూరమని వెరవకుండా ముందుగా వచ్చి ఉద్యోగంలో చేరాలని సూచించారు. తర్వాత మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నిరుద్యోగులు యువతీ యువకులు అసాంఘిక, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు, అక్రమ రవాణాకు దూరంగా ఉండి భవిష్యత్ బాగుచేసుకోవాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్ మాట్లాడుతూ, నిరుద్యోగులు యువత వచ్చిన ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సంగీత, సీడాప్ ప్రతినిధులు భారతి, ఆర్‌ఐటిఐ వైస్ ప్రిన్సిపల్ బొంజుబాబు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన గిరిజన యువత


నిరసన తెలుపుతున్న వాలంటీర్లు

సమస్యలపై వాలంటీర్ల నిరసన

ప్రజాశక్తి -జి మాడుగుల : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిమాడుగుల మండల కేంద్రంలో మంగళవారం వార్డు, సచివాలయ వాలంటీర్లు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు చంటిబాబు అధ్యక్షతన నిర్వహించిన వాలంటీర్ల సమావేశం అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్ మాట్లాడుతూ వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు నెలలు బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ఎన్నికల హామీలో భాగంగా వాలంటీర్లుకు రూ. పదివేలు వేతనం చెల్లించాలన్నారు. బలవంతంగా రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. వాలంటీర్లతో . బలవంతంగా రాజీనామాలు చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వాలంటీర్ల జాబ్‌చార్ట్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో వాలంటీర్లు సంఘం సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రసాద్, మండల అధ్యక్షులు టి శోభన్ కార్యదర్శి రాజేందొర . చిన్నారావు. పాడేరు మండల అధ్యక్షులు సురేష్ నాయకులు ఎస్ చంటిబాబు, ఆర్ తిరుపతి, యు కృష్ణవేణి. మచ్చ కొండమ్మ. 17 పంచాయతీల వాలంటీర్స్ పాల్గొన్నారు.

విఒఎల బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : వెలుగులో పనిచేస్తున్న విఒఎల ఏడు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి.పోతురాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు సకాలంలో వేతనాలు చెల్లించకుండా రాజకీయ వేధింపులు చేయడం తగదున్నారు. తొలగించిన యానిమేటర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఏజెన్సీలో గిరిజనేతరుల జామాయిల్ సాగును అరికట్టాలి

ప్రజాశక్తి-చింతూరు : ఏజెన్సీలో గిరిజనేతరులు చేస్తున్న జామాయిల్ సాగును అరికట్టాలని ఆదివాసీ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జెఎసి నాయకులు శీలం తమ్మయ్య, సోము శ్రీహరి, మీడియం కొండబాబు, నామాల శివయ్య, రామకృష్ణ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనేతరులు ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించి, ఇష్టారాజ్యంగా గిరిజనులను దోపిడీకి గురి చేస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల భూములను కౌలుకు తీసుకొని జామాయిల్ సాగు చేస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని, దీనిపై తక్షణమే విచారణ జరిపి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అందరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపిపి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బందం శ్రీదేవి ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని నరసాపురం పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చంటి పిల్లలు పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆశ కార్యకర్తల సమస్యలు తెలుసుకొని ఉన్నతాధికారుల దృష్టిలో తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం, వైద్యాధికారి డాక్టర్ సుజిత, సిహెచ్‌ఓ అన్నపూర్ణ, పిహెచ్‌ఎన్ నాగమణి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐదు రోజులుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వివిధ జిల్లాలలో వరద ముంపుతో బాధపడుతున్న ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్రం సాయం చేయాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం

ఉమ్మడి విశాఖ జిల్లాలో 1228 మంది దరఖాస్తు

త్వరలో కౌన్సెలింగ్ తేదీలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 15 వరకు ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గడువు పెంచింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రాతిపదికన విశాఖ జిల్లా కలెక్టర్ బదిలీలు నిర్వహించనున్నారు. బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ తేదీలను కొద్ది రోజుల్లో ప్రకటించనున్నారు. బదిలీలకు తమ సమ్మతి తెలుపుతూ ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లాలో 1228 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల ఆధారంగా మ్యూచువల్, స్పౌజ్, మెడికల్, వికలాంగులు, వితంతువులకు బదిలీల్లో తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఉద్యోగుల బదిలీలకు సిఫార్సు లేఖలు ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి విశాఖ జిల్లా కలెక్టర్‌కు వెళ్తున్నాయి. అనకాపల్లి జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ కేటగిరీలకు చెందిన ఉద్యోగులు 3,723 మంది పనిచేస్తున్నారు. వీరిలో 823 మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. ఎఎన్‌ఎమ్, వెటర్నరీ, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ సచివాలయ ఉద్యోగులకు బదిలీ నుంచి మినహాయింపును ప్రభుత్వం ఇచ్చింది. ఈ - క్రాప్ నమోదు వుండడంతో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు బదిలీల నుంచి మినహాయించగా, మిగిలిన మూడు శాఖలకు సంబంధించిన ఉద్యోగులను సర్దుబాటు చేయడంతో ప్రస్తుత బదిలీల నుంచి మినహాయింపు లభించింది.

అనకాపల్లి జిల్లాలో బదిలీకానున్న గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో 96 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, 126 మంది మహిళా పోలీసు, 96 మంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, 124 మంది డిజిటల్ అసిస్టెంట్లు, 165 మంది సర్వేయర్లు, 109 మంది విఆర్‌ఒలు, 107 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నట్లు సమాచారం. కౌన్సిలింగ్ తేదీలు ప్రకటించిన తరువాత ఆ తేదీల ప్రకారం దరఖాస్తు చేసుకున్న సచివాలయ ఉద్యోగులు హాజరుకావాల్సివుంది.

జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై పోరాటాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అన్నివిధాలా పోరాడుతుందని సంఘం రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు అన్నారు. సంఘం విశాఖపట్నం శాఖ, అనుబంధ సంఘాలైన బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల సమావేశం మంగళవారం ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా శుక్రవారం సభ్యులకు వినాయక ప్రతిమలు, మొక్కలు, చవితి కథా పుస్తకం పంపిణీ చెయ్యాలని నిర్ణయించారు. సమావేశంలో ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పి.నారాయణ, జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పిఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులు కె.మురళీకృష్ణ, బి.శివప్రసాద్, బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈరోతి ఈశ్వరరావు, కింతాడ మదన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విఎస్.జగన్మోహన్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గండి కొత్తగూడెంలో విద్యుత్ పునరుద్ధరణ

పిఒ స్పందనకు సిపిఎం ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని గండి కొత్త గూడెం గ్రామంలో ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ ఆదేశాలతో విద్యుత్ పునరుద్ధరణ జరిగింది. ఈ గ్రామానికి రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సిపిఎం ప్రజాప్రతినిధులు ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన పిఒ సోమవారం గ్రామాన్ని సందర్శించి కరెంట్ స్తంభాలు పడి ఉండటాన్ని చూసి విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఒ ఆదేశాలతో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం కరెంట్ స్తంభాలు వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఐటిడిఎ పిఒ సత్వరమే స్పందించడం పట్ల వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఇతర సిపిఎం ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాకుండా గండికొత్తగూడెం బ్రిడ్జి మరమ్మతులు, కూటూరు సచివాలయం, నూతన హాస్పిటల్ భవనం పనులు పూర్తి, హార్వాయిగూడెం, కొండాయిగూడెం ఎంపిపి పాఠశాలల భవనాలు శిథిలావస్థ చేరడంపై తదితర సమస్యలను పిఒ దృష్టికి సిపిఎం ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. లింగాపురం నుండి రేగులపాడుకు రోడ్డు, రేగులపాడు-బొజ్జరాయిగూడెం మధ్యలో కల్వర్లు మంజూరు చేయాలని కోరారు. దీనికి స్పందించిన పిఒ అపూర్వ భరత్ కూటూరు సచివాలయం, పిహెచ్‌సి భవనాలను త్వరగా పూర్తి చేసి ప్రారంభిస్తామని, కొండాయిగూడెం ఎంపిపి పాఠశాలను విజిట్ చేస్తానని, నూతన భవనం నిర్మాణానికి ప్రయత్నం చేస్తానని పిఒ హామీ ఇచ్చారు. గండికొత్తగూడెం బ్రిడ్జి, హార్వాయిగూడెం పాఠశాల భవన మరమ్మతులకు, రహదారులు, కల్వర్టుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, సిపిఎం ప్రజాప్రతినిధులైన వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, చూచిరేవుల గూడెం ఎంపీటీసీ కారం జయసుధ, పెద్దార్కూర్ ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, రేగులపాడు సర్పంచ్ బొగ్గా రామారావు, లింగాపురం సర్పంచ్ సోడే శంకర్, పెద్దార్కూర్ సర్పంచ్ మడకం నాగమణి, కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, గిరిజన సంఘం నాయకులు తెల్లం తమ్మయ్య, మాజీ ఎంపీటీసీ పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.


సాగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులు


వినతిపత్రం అందజేస్తున్న మద్యం దుకాణ కార్మికులు

ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : ఐదేళ్ల పాటు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసిన తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ప్రభుత్వ మద్యం దుకానాల్లో పని చేస్తున్న కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ మేరకు ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక తహశీల్దారు సుబ్బారావుకు, ఎస్సై సత్యనారాయణకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విఆర్.పురం ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్వైజర్ మడకం కిషోర్ కుమార్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్ చేసి టెండరింగ్ విధానం ద్వారా మద్యం దుకాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. దీని వల్ల ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేసే సూపర్ వైజర్లు, సేల్స్ మెన్లు ఉపాధి కోల్పోవడమే కాకుండా తమ కుటుంబాలు రోడ్డున పడనున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, అవుట్ సోర్సింగ్ ద్వారా తీసుకున్న తమకు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించి తమ కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే తమ యూనియన్ తరుపున మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. కానీ వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాము ఈ 7న మద్యం దుకాణాల బంద్‌కు పిలుపునిచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మద్యం దుకాణాల కార్మికులు బేతే రాజేష్, ముల్లి ముత్తయ్య, బేత నరసింహారావు, కరక రాజ్ కుమార్, తాటి వీరబాబు, శ్యామ్ కుమార్, సారా పాండురాజు, చీమల వెంకన్న బాబు, చీమల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్త హత్య కేసులో కోడలు అరెస్ట్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అత్త హత్య కేసులో కోడలను రాజవొమ్మంగి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అత్త లక్ష్మి మీద కోపంతో ఆమె కోడలు జ్యోతి ఈనెల 1వ తేదీ రాత్రి కర్రతో అత్తను కొట్టడంతో అత్త లక్ష్మి మృతి చెందింది. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజవొమ్మంగి సీఐ ఎం సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్ వెంకయ్య కేసు నమోదు చేశారు. నిందితురాలు జ్యోతిని మంగళవారం అరెస్టు చేసి, అడ్డతీగల కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ నిందితురాలకు 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ సన్యాసినాయుడు మంగళవారం తెలిపారు.

సాంకేతిక లోపంతో నిలిచిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : గోకవరం డిపో నుండి మారేడుమిల్లి మీదుగా ప్రతి రోజు పాటకోట వెళ్లే ఆర్‌టిసి బస్సు మంగళవారం పోతవరం వద్ద సాంకేతిక లోపం తలెత్తడంతో ఆగిపోయింది. దీంతో బస్సులో ఉన్న 20 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పలువురు ఆటోలు, ఇతర వాహనాల సహాయంతో వారి గ్రామాలకు వెళ్లిపోయినట్టు స్థానికులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కండిషన్ లేని బస్సులు నడపడంతో గతంలో ఎన్నో సార్లు ఇటువంటి సమస్యలు తలెత్తాయని, అయినా మళ్లీ మళ్లీ అవే సమస్యలు పునరావృతం కావడంపై ప్రయాణికులు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏజెన్సీలో కండిషన్ ఉన్న బస్సులను నడపాలని పలువురు కోరుతున్నారు.

దుర్గాలమ్మ ఆలయం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరంలోని పూర్ణా మార్కెట్ ప్రాంతంలో ఉన్న శ్రీ దుర్గాలమ్మ అమ్మ వారి హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. ఐదు నెలల కాలానికిగాను రూ.12 లక్షల నగదు, ఇవి కాకుండా బంగారం, వెండి రూపంలో కానుకలు వచ్చాయి. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి శేఖర్ బాబు, భక్తి మంగరాజు, నిమ్మ శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.